



# కరపత్రం

SINCE 2014

సోమవారం మార్చి 03 2025 | సంపుటి :0 | సంచిక : 140 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# అవసరమైతే రోబోల సాయంతో

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు: సీఎం రేవంత్‌రెడ్డి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు.
- 2014 తర్వాత టన్నెల్ పనులు ఆగిపోయాయని, విద్యుత్ సరఫరా నిలిపివేశారని సీఎం ఆరోపణలు.
- 11 కేంద్ర సంస్థలు, ప్రైవేట్ ఏజెన్సీలు 9 రోజులుగా సహాయ కార్యక్రమాలు చేస్తున్నారు.
- ప్రమాదంపై రాజకీయం చేయడం తగదని, గత ఘటనలతో తేడా ఉన్నట్టు వివరణ.



2లో..

దోమలపెంట: ఎలాంటి ప్రాణ నష్టం ఉండకూడదనే ఉద్దేశంతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో మనుషులు, మిషిన్లతో పాటు అవసరమైతే రోబోల సాయం తీసుకునే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సొరంగంలో 8మంది గల్లంతైన నేపథ్యంలో సహాయకచర్యలను సీఎం, మంత్రులు టన్నెల్‌లోకి వెళ్లి స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎస్ఎల్‌బీసీ వద్ద అన్ని విభాగాల అధికారులు, ఏజెన్సీలతో సహాయక చర్యలపై సమీక్షించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. "ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను 2005-06లో ప్రారంభించారు. 2014 తెలంగాణ ఏర్పడే నాటికి 32 కిలోమీటర్ల టన్నెల్ పూర్తయింది. కానీ, గత పదేళ్లుగా భారాస ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీని పట్టించుకోలేదు. ఈ పనులు చేస్తున్న సంస్థ విద్యుత్ బిల్లులు చెల్లించలేదని విద్యుత్ సరఫరా కూడా నిలిపివేశారు. దీంతో గత పదేళ్లుగా టన్నెల్ పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ ప్రాంతానికి కృష్ణా జలాలు అందించాలని నిర్ణయించాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రాజెక్టును పూర్తి చేయాలని.. ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభించాం. టన్నెల్ బోరింగ్ మిషన్‌కు కావాల్సిన విడి భాగాలను అమెరికా నుంచి తెప్పించి పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకున్నాం. కానీ, అనుకోకుండా ఈ దుర్ఘటన జరిగింది.



## BRS నుంచి వచ్చిన 10 మంది ఎమ్మెల్యేలు తిరిగి వెళ్లిపోతరు

2లో

### - ఎంపీ రఘునందన్ రావు

హైదరాబాద్:
బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చిన 10 మంది గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు తిరిగి వెళ్లిపోతారని బీజేపీ నేత, మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. పక్క పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్యేలను సీఎం రేవంత్ రెడ్డి కాపాడుకోలేకపోతున్నాడని అన్నారు. ఆదివారం (మార్చి 2) హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో రఘునందన్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో పాలన పడకేసిందని.. సీఎం రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకావడం లేదని విమర్శించారు.



2లో

## ఇది ఒక విపత్తు.. రాజకీయాలొద్దు.. బాధిత కుటుంబాలను ఆదుకుంటాం:

### SLBC ఘటనపై సీఎం రేవంత్

SLBC టన్నెల్ ను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు..ఈ ఘటన అనుకోకుండా జరిగిందని, ఇది ఒక విపత్తు అని.. దీనిపై రాజకీయం చేయొద్దని అన్నారు.




## రాష్ట్రంలో దుర్మార్గమైన ప్రతిపక్షం ఉంది..

# రైజింగ్ తెలంగాణను ఎవరూ ఆపలేరు

రైజింగ్ తెలంగాణను ఎవరూ ఆపలేరని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. వనపర్తి జిల్లా పర్యటనలో భాగంగా సీఎం రేవంత్, మంత్రులతో కలిసి వివిధ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, అది చూడకుండా బీఆర్ఎస్ విమర్శలకు దిగుతోందని అన్నారు. రాష్ట్రంలో దుర్మార్గమైన ప్రతిపక్షం ఉందని, బీఆర్ఎస్ మాదిరిగా తమది గడీల పాలన కాదని ఘాటు వ్యాఖ్యలు చేశారు.తాము బీఆర్ఎస్ మాదిరిగా మాట ఇచ్చే తప్పే రకం కాదని, ఆర్థిక ఇబ్బందులు ఉన్న పథకాలను అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా భట్టీ అన్నారు. కులగణనలో పాల్గొనని నేతలు మమ్మల్ని విమర్శిస్తారా అని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీ చేశామని, జాతరలాగా సంక్షేమ పథకాలుఅమలు చేస్తున్నామని భట్టీ తెలిపారు. ప్రజలకు జవాబుదారీగా ఉంటామని అన్నారు. కాంగ్రెస్ లాగా పథకాలు ఎందుకు అమలు చేయలేదో బీఆర్ఎస్ ను ప్రశ్నించాలని కార్యకర్తలకు సూచించారు.

## ప్రయాణికులకు గుడ్‌న్యూస్..

ఇకపై చేతిలో చిల్లిగవ్వ లేకుండా ఆర్టీసీ బస్సుల్లో తిరగొచ్చు..!

ఆర్టీసీ బస్సుల్లో కొంత మంది కండక్టర్ దగ్గర టికెట్ తీసుకున్నప్పుడు చిల్లర సమస్య రావడం సర్వ సాధారణం. ఎవరైనా బస్సు ఎక్కి పెద్ద నోటు ఇస్తే.. చిల్లర లేక గొడవపడటం, ఏకంగా బస్సులోంచి దింపడం లాంటి ఘటనలు జరిగాయి. కొన్ని సందర్భాల్లో కండక్టర్స్ చిల్లర లేకపోతే..



మిగతాది 2లో

# రెండున్నరేళ్లలో మామునూరు ఎయిర్ పోర్టు పూర్తి చేస్తాం

- రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయింపులలో ఆలస్యం కారణంగా ఎయిర్‌పోర్టు నిర్మాణం ఆలస్యమైంది.
- కేంద్రం ఒత్తిడి వల్ల ఎనిమిది నెలల్లో క్లియరెన్స్ ఇచ్చారు.
- మామునూరు ఎయిర్‌పోర్టు 1981 వరకు ఆసియాలో అతిపెద్ద ఎయిర్‌పోర్టుగా ఉంది.
- మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం 2800 మీటర్ల రన్‌వే, 280 ఎకరాల భూసేకరణ అవసరం.
- గత ప్రభుత్వాల నుంచి సరైన సహకారం లేకపోవడంతో ఆలస్యం.
- రాష్ట్ర ప్రభుత్వం త్వరగా భూసేకరణ చేస్తే నిర్మాణం వేగవంతమవుతుందని తెలిపారు.
- శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుండి NOC తీసుకొని మామునూరు ఎయిర్‌పోర్టుకు క్లియరెన్స్ ఇచ్చారు.
- భద్రాద్రి ఎయిర్‌పోర్టు కొత్త స్థలం పరిశీలనలో ఉంది.



2లో

హైదరాబాద్:
రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించకపోవడం మామునూరు విమానాశ్రయం ఏర్పాటు ఆలస్యమైందని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. కేంద్రం ఒత్తిడి వల్ల భూ కేటాయింపులు జరగడంతో ఎనిమిది నెలల్లోనే క్లియరెన్స్ ఇచ్చామని రామ్మోహన్ నాయుడు వివరించారు. హైదరాబాద్ కవాడీగూడలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. "మామునూరు ఎయిర్‌పోర్ట్ క్లియరెన్స్ ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ. ఈ విమానాశ్రయం గతంలో ఆసియాలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్టుగా ఉండేది.

## నా మీద కోపంతో రైతులపై చూపిస్తున్నారు : కేటీఆర్



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆ ర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి విరుచుకు పడ్డారు. తన మీద కక్షతో ఆ కోపాన్ని రైతుల మీద చూపిస్తున్నారని కేటీఆర్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు సిరిసిల్ల లోని జిల్లెల గ్రామానికి చెందిన రైతు అబ్బాడి రాజిరెడ్డి ఇంటికి వెళ్ళి ఆయనను పరామర్శించారు. తన నియోజకవర్గంలో ఎవరికి అన్యాయం జరిగినా తాను ముందుండి కాపాడుకుంటామని ఆయన పేర్కొన్నారు. నా మీద కోపంతో, తమ పార్టీ మీద కక్షతో సిరిసిల్ల కలెక్టర్ అన్యాయంగా, అందునా అనారోగ్యంతో ఉన్న పేద రైతును అరెస్ట్ చేసి జైలుకు పంపడం ఎంతవరకు న్యాయం అని ఆయన ప్రశ్నించారు. తాము అధికారంలో ఉన్నపుడు కేసీఆర్ కూడా ఇలాగే కక్ష సాధింపు రాజకీయాలు చేయాలి అనుకుంటే వీళ్ళంతా ఎక్కడ ఉండేవారని కేటీఆర్ మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ఇలాంటి పనులు మానుకొని పాలన మీద దృష్టి పెట్టాలని హితవు పలికారు. కాగా ఒకే ఇంటిపేరు ఉండటం వలన అబ్బాడి అనిల్ అనే బీఆర్ఎస్ నాయకునికి బదులు, అబ్బాడి రాజిరెడ్డి అనే రైతును అరెస్ట్ చేశారని విమర్శలు ఎదురయ్యాయి.

# సంపాదకీయం

## మాయలేళ్లు... మరీచికలు!

'చెప్పేదొకటి, చేసేదొకటి' స్వభావం గలవాళ్లను మోసగాళ్లనే అంటాము. ప్రజా జీవితంలో ఉంటూ మచ్చుకైనా పారదర్శకత లేని ఇటువంటి బ్యాచ్ కూడా మోసగాళ్లే! మాయ లేడి వేషం వేసుకొని మోసగించిన మారీచునికి వీళ్లు వారసులనుకోవాలి. ఇటువంటి మూడు మాయలేళ్లు కలిసి కూటమి కట్టి ఏర్పాటు చేసిన ప్రభుత్వం నుంచి హామీల అమలు గురించి ఆశించడమంటే మరీచికల వెంట పరుగులు తీయడమే! ఈ కూటమి ప్రవేశపెట్టిన రెండో బడ్జెట్‌లో కూడా ఎన్నికల వాగ్దానాలకు నామం పెట్టారని ప్రతిపక్షం విమర్శిస్తున్నది. ప్రతిపక్షంగా అది వాళ్ల డ్యూటీ కావచ్చు.కూటమి మాత్రం ఆ విమర్శలను పట్టించుకోదు. మేనిఫెస్టో హామీలను అమలుచేయలేమనీ, చేయబోమనీ వారికి ముందే తెలుసు. రాష్ట్ర శ్రేయస్సు, ప్రజా సంక్షేమం వగైరాల కంటే పరమ పవిత్రమైన ఆశయాలు, ప్రయోజనాలు వారికి విడివిడిగా వేరే ఉన్నాయి. ఆ ప్రయోజనాలు నెరవేరాలంటే అధికారం కావాలి. విడివిడిగా ఉంటే అది కుదిరే పని కాదు. అందుకని ఒక్కటయ్యారు. అయినా నమ్మకం లేక 'కొండమీది కోతిని నేలకు దించుతాం, బొందితో కైలాసం తీసుకుపోతాం, కళ్ల ముందటే వైకుంఠాన్ని నిలబెడతాం' తదితరాల స్థాయికి తగ్గని హామీలను మేనిఫెస్టోలో చేర్చుకున్నారు. వాటిని నెరవేర్చి తీరుతామని కూటమి నేతలు వివిధ సభల్లో చేసిన మంగమ్మ శపథాలు,భీష్మ ప్రతిజ్ఞలు ఇప్పటికీ జనం చెవుల్లో గింగిరుమంటూనే ఉన్నాయి.పిట్టల దొర వాగ్దానాలకు తోడు ఢిల్లీ సర్కార్ సౌజన్యంతో ఎన్నికల సంఘం కూడా ఓ చేయి వేయడంతో కూటమి అధికారంలోకి వచ్చింది. వచ్చిన అధికారాన్ని ఏ రకంగా ఉపయోగించుకోవాలి అనే విషయంపై ఎవరి ప్రాధాన్యాలు వారికున్నాయి. జాతీయ స్థాయిలో కూటమికి పెద్దన్నగా బీజేపీ ఉంటున్నా ఏపీలో మాత్రం తెలుగుదేశం పార్టీదే పెద్దన్న పాత్ర. ఆ పార్టీ చంద్రబాబు నాయుడు నాయకత్వంలోకి మారిన తర్వాత ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వ్యతిరేకించే వైఖరి తీసుకుంటున్నది. విద్య, వైద్యం వంటి ప్రాథమిక విషయాలు కూడా ప్రభుత్వ బాధ్యత కాదనీ, ఆ రంగాల్లో ప్రైవేట్ సేవలు అవసరమనీ చెప్పిన చరిత్ర బాబుది.ప్రభుత్వం నుంచి పొందే సేవలకు కూడా ప్రజలు యూజర్ ఛార్జీలు చెల్లించవలసిందేనని ఆయన గతంలోనే ఘంటా పథంగా ప్రకటించారు. అదేరకంగా పాలించారు. మొన్నటి ఎన్ని కల సందర్భంగా ఆయన ప్రకటించిన సూపర్ సిక్స్ వాగ్దానాలకు ఆయన సిద్ధాంతపరంగానే వ్యతిరేకి! అయినప్పటికీ అటువంటి మేనిఫెస్టోకు రూపకల్పన చేయడమంటే అధికారం పొందడం కోసం ఉద్దేశపూర్వకంగా మోసానికి తెగబడ్డారంటే తప్పవుతుందా? ఈ మోసాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఆయన ఈ మధ్యనే 'పీ4' అనే ఓ వంటింటి చిట్కాను ప్రకటించారు.ఈ ఉగాది నుంచి అమలుచేయ సంకల్పించిన ఈ 'పీ4' చిట్కాతో రాష్ట్రంలోని పేదరికం మటుమాయమైపోతుందట! పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ భాగస్వామ్యమని దాని పూర్తి పేరు. సమాజంలోని పది శాతం మంది అత్యంత సంపన్నులు అట్టడు గున ఉన్న 20 శాతం మంది కడుపేదలను దత్తత తీసుకో వాలట! ఈ పేదవారి అవసరాలను ఆ సంపన్నులు గుర్తించి తృణమో పణమో సాయం చేసి పేదరికం నుంచి బయట పడేయాలట! ఈ 'సామాజిక బాధ్యత' నెరవేర్చినందుకు ఆ సంపన్నులకు ఏ సహజ వనరుల్ని కట్టబెడతారన్నది ఇక్కడ రహస్యం.కుల మత ప్రాంతీయ లింగ భేదాల్లేకుండా ఈ దేశంలో పుట్టిన ప్రతి మనిషికీ భారత రాజ్యాంగం సమాన హక్కులను కల్పించింది. చారిత్రకంగా వివిధ సమూహాల మధ్య అభివృద్ధి క్రమంలో ఏర్పడిన అంతరాలను పూడ్చడానికి ప్రభుత్వాలు పూనుకోవాలని ఆదేశించింది. సహజ వనరుల్లో అందరికీ సమాన భాగస్వామ్యం ఉండాలి. అందరూ సమానస్థాయిలో పోటీ పడగలిగే అవకాశాలు (లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్) ఏర్పడాలని రాజ్యాంగం చెబుతున్నది. అటువంటి పరిస్థితులను ప్రభు త్వాలు ఏర్పాటు చేసినట్లయితే పేదరికాన్ని పేదలే జయిస్తారు. ఈ దేశాన్ని కూడా సంపన్న దేశంగా నిర్మిస్తారు. రాజ్యాంగం ఆశయం కూడా అదే! ఎవరి ఎంగిలి మెతుకుల తోనో పండుగ చేసుకొమ్మని చెప్పలేదు.ఈ 'పీ4' కార్యక్రమాన్ని గురించి రానున్న రోజుల్లోయెల్లో మీడియా ఏ రకమైన ప్రచారాన్ని చేపట్టబోతున్నదోనని ఊహించుకుంటేనే గగుర్పాటు కలుగుతున్నది. ఇంతటి మహత్తరమైన ఆలోచన గతంలో కార్ల్ మార్క్స్‌కు గానీ, అంబేద్కర్‌కు గానీ, మరెవ్వరికీ గానీ రాలేదని వీరతాడు వేయవచ్చు. ఇకముందు రాబోదని కూడా ఛాలెంజ్ చేయవచ్చు. ఈ చిట్కా వైద్యంతో చిటికెలోనే పేదరికం పరారైందని కూడా ప్రకటించవచ్చు.'పీ4' సంక్షేమ ప్రచారం హోరులో తెలుగుదేశం పార్టీ అధినేతలకు మిగిలిన పవిత్ర కార్యక్రమం ఏమున్నది? ఒక్క అమరావతి తప్ప! దానికి అభివృద్ధి అనే ముసుగు వేయడం తప్ప! మిగిలిన ఈ మూడేళ్లూ (ఒక సంవత్సరం జమిలి ఎన్నికల కోత ఉండవచ్చు) అమరావతి సేవలోనే ప్రభుత్వం తరించే అవకాశం ఉన్నది.అమరావతి నిర్మాణానికి రూపాయి కూడా ప్రభుత్వం ఖర్చు చేయవలసిన అవసరం లేదని, దాని ల్యాండ్ బ్యాంక్ ద్వారా సంపాదించిన సొమ్ముతోనే నిర్మాణం జరిగి పోతుందని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు పలుమార్లు చెప్పిన విషయం పాఠకులకు గుర్తుండే ఉంటుంది. అందుకు భిన్నంగా ఇప్పటికే ప్రపంచ బ్యాంకు, జర్మనీ, 'హడ్కో'ల ద్వారా 30 వేల కోట్లకు పైగా అప్పులు చేశారు. ఇంకో ఇరవై వేల కోట్ల రూపాయలను సీఆర్‌డీఏ ద్వారా సమీకరించేందుకు ఆదేశిస్తూ జీవో కూడా ఇచ్చారు.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలను గనక ఉపయోగంలోకి తెచ్చుకుంటే వైజాగ్ తక్షణమే అందుబాటులోకి వచ్చేది. ఆ సంగతి పక్కనబెట్టి, వైజాగ్‌ను విస్మరించి, ఇన్ని వ్యయప్రయాసలకోర్చడం వెనుక అసలు కథ ఇప్పటికే చాలామందికి అర్థమై ఉంటుంది. రాష్ట్ర రాజధాని పేరుతో అతి పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరతీశారని, దాని ద్వారా ఆ పార్టీ ముఖ్యనేతలు, వారి అనుయాయులు వేల కోట్ల రూపాయలు దండుకోవడానికి ప్రణాళికలు రచించారనే విమర్శలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. ఈ విమర్శలను పూర్వపక్షం చేసే సంతృప్తికరమైన సమాధానాన్ని తెలుగుదేశం నాయకత్వం ఇప్పటికీ ఇవ్వలేకపోతున్నది. ప్రతిపక్షం వారు రుజువులు చూపిస్తూ చేస్తున్న ఆరోపణలను సహేతుకంగా ఖండించనూ లేకపోతున్నది. దీన్నిబట్టి ఈ మూడేళ్లలో జరగ బోయేది %-% పేదలకు 'పీ4' గంజినీళ్లు! పాలక పెద్దలకు కనక వర్షం!! ఇక భారతీయ జనతా పార్టీది జాతీయ స్థాయి లక్ష్యం. వరసగా మూడుసార్లు కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి బీజేపీ, సంఘ్ పరివార్‌లు మంచి ఊపుమీదున్నాయి. ఇక ఆరెస్సెస్ స్థాపిత లక్ష్యమైన హిందూ రాష్ట్ర ఎజెండాను బయటకు తీసే ముహూర్తం ఇప్పుడు కాక ఇంకెప్పుడని అవి భావిస్తు న్నాయి. మొన్నటి 'మహా కుంభమేళా' సందడిలోనే అందుకు అంకురార్పణ కూడా జరిగిపోయిందట! 'అమర్ ఉజాలా' అనే ఉత్తరాది హిందీ పత్రిక కోసం అలోక్ కుమార్ త్రిపాఠీ రాసిన వార్తా కథనాన్ని ఉటంకిస్తూ 'ది వైర్ తెలుగు డాట్ ఇన్' ఈ విషయాన్ని వెల్లడించింది.ఇంకో పాతికేళ్లలో దేశాన్ని హిందూ దేశంగా ప్రకటించే అవకాశం ఉన్నదట! అందుకు అవసరమైన అడుగులన్నీ ఇక వరసగా వేసుకుంటూ వెళతారు. 'రుషి సంవిధాన్' అనే పేరుతో ప్రత్యామ్నాయ రాజ్యాంగం కూడా సిద్ధమైందట! దీన్నే 'సనాతన రాజ్యాంగ'మని పరివార్ ముఖ్యులు పిలుచుకుంటున్నారు. రాజ్యాంగాన్ని మార్చబో మంటూ బీజేపీ నేతలు పదేపదే ఇస్తున్న హామీలన్నీ బూటకమే నని ఇప్పుడు సిద్ధంగా ఉన్న 'రుషి సంవిధాన్' లేదా సనాతన రాజ్యాంగం రుజువు చేస్తున్నది.సంఘ్ పరివార్ తన అంతిమ గమ్యాన్ని చేరుకోవడానికి కీలకమైన తొలి అడుగు జమిలి ఎన్నికలు లేదా ఒన్ నేషన్ ఒన్ ఎలక్షన్ (ఒక జాతి... ఒకే ఎన్నిక). ఆ తర్వాత 'ఒక జాతి... ఒకే భాష', 'ఒక జాతి... ఒకే మతం' వంటి నినాదాలు మొదలు కావచ్చు. కనుక ఎట్టి పరిస్థితుల్లో జమిలి ఎన్నికల కార్యక్రమాన్ని ఈ దఫా వాయిదా వేసే అవకాశం లేదు.అందుకు అవసరమైన రాజ్యాంగ సవరణలకు సరిపోయే సంఖ్యాబలం ఎన్డీఏకు ఉన్నదా లేదా అనే శంకలు అనవసరం. సమకూర్చుకోగలమనే నమ్మకం ఎన్డీఏకు ఉన్నది.

# ప్రయాణికులకు గుడ్‌న్యూస్..

మొదటిపేజీ తరువాయి

టికెట్ వెనకాల తర్వాత ఇస్తామంటూ రాసి ఇస్తుంటారు. కొంత మంది కండక్టర్స్ ప్రమేయం లేకుండా.. తమ దిగాల్సిన స్టాప్ రావడంతో హడావుడిగా దిగేస్తుంటారు. దీంతో చిల్లర తీసుకోవడం మరిచిపోతుంటారు. కొంత మంది ప్రయాణికులు ఆయా బస్సు డిపోల దగ్గర వెళ్లి మిగిలిన చిల్లర తీసుకున్న సందర్భాలున్నాయి. ఒక్కోసారి ప్రయాణికులు.. మరోసారి కండక్టర్స్ వల్ల చిల్లరకు పెద్ద ప్రాబ్లమ్ అవుతోంది. కొన్ని సందర్భాల్లో కండక్టర్స్ దగ్గర నిజంగానే చిల్లర ఉండవు. ఇలా సమస్యల అన్నింటికీ చెక్ పెట్టేందుకు తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. బస్సుల్లో ఆన్‌లైన్ టికెటింగ్ విధానాన్ని తీసుకొచ్చింది తెలంగాణ ఆర్టీసీ.
ప్యాసింజర్లకు, కండక్టర్లకు మధ్య చిల్లర గొడవలకు స్వస్తి పలికేందుకు ఈ కీలక నిర్ణయం తీసుకుంది. సిటీ బస్సుల్లో క్యూ ఆర్ కోడ్ స్కానింగ్‌తో ప్రయాణం చేయవచ్చని తెలిపింది. ఇక నుంచి యూపీఐ పేమెంట్స్ ద్వారా ఆర్టీసీ బస్సుల్లో టికెట్ తీసుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టంలో భాగంగా ఆన్‌లైన్ టికెటింగ్ తీసుకొచ్చామంటున్నారు ఆర్టీసీ అధికారులు. త్వరలోనే మరిన్ని ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకీ వస్తాయని అధికారులు తెలిపారు. చేతిలో చిల్లి గవ్వ లేకుండా కూడా ఇక నుంచి ఆర్టీసీ బస్సుల్లో తిరగొచ్చని తెలిపింది. అలా అని అకౌంట్‌లో డబ్బులు ఉండాల్సిందే..! దీంతో చిల్లర లేదని ప్రయాణం మధ్యలో బస్సు నుంచి దింపే పరిస్థితి నుంచి ప్రయాణికులకు విముక్తి లభించనుంది.
ప్రస్తుతానికి సిటీలో స్టాపులు దగ్గర దగ్గరగా ఉండడం, బస్సులో రద్దీ ఎక్కువగా ఉండడం వల్ల స్కానింగ్ చేయడం ఆలస్యం అవుతుందని, దానితోపాటు సిగ్నల్ సమస్య కూడా ఉన్నదని కండక్టర్లు అంటున్నారు. బస్సులో సరిగా సిగ్నల్ లేక ఆన్‌లైన్ పేమెంట్ ఆలస్యం అవుతుందని, దానివల్ల కొంత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందంటున్నారు కండర్టర్లు. సిగ్నల్ ఎక్కువగా ఉండే సిమ్‌లు ఇస్తే ఆ సమస్యను కొంత నివారించ వచ్చని ఆర్టీసీ కండక్టర్లు అంటున్నారు.

# అవసరమైతే రోబోల సాయంతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

ప్రమాదాలు జరిగినప్పుడు రాజకీయాలు చేయడం కాదు.. బాధిత కుటుంబాలను ఆదుకోవాలి. విపత్తు సమయంలో జాతీయ స్థాయిలో నిపుణులైన 11 కేంద్ర సంస్థలు, ప్రైవేటు ఏజెన్సీలు 9 రోజులుగా సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నాయి. గల్లంతైన 8మంది ఆచూకీ ఇప్పటి వరకూ తెలియలేదు. ఈ ఆపరేషన్ కొలిక్కి రావడానికి మరో రెండు.. మూడ్రోజుల సమయం పడుతుందని అధికారుల సమీక్షలో తేలింది. కన్వేయర్ బెల్ట్ పాడవటం వల్ల సిల్టు తొలగించేందుకు ఆటంకమేర్పడింది. రేపు సాయంత్రానికి కన్వేయర్ బెల్ట్ అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. మట్టి తీసిన తర్వాత మిషన్ తొలగించి, గల్లంతైన వారిని గుర్తించాల్సి ఉంటుంది. ఇలాంటి ప్రమాదంపై రాజకీయం చేయడం తగదు. సొరంగంలో గల్లంతైన



కుటుంబాలకు అన్ని పార్టీలు అండగా ఉండాలి. మనో ధైర్యం కోల్పోలేదు.. మరింత పట్టుదలతో ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. టన్నెల్ పనుల్లో ఎలాంటి ప్రాణ నష్టం జరగకూడదనే ఉద్దేశంతో మనుషులు మిషిన్లతో పాటు అవసరమైతే రోబోలను వినియోగించాలని అధికారులను ఆదేశించా" అని సీఎం తెలిపారు.

విపక్షాలు బురద రాజకీయం చేస్తున్నాయి..
"ఈ ఘటనలో ప్రభుత్వ నిర్లక్ష్యం, లోపం ఎక్కడైనా ఉందా? దురదృష్టకర ఘటనపై విపక్షాలు బురద రాజకీయం చేస్తున్నాయి. గతంలో శ్రీశైలం పవర్‌ప్లాంట్ అగ్ని ప్రమాదంలో ఆరుగురు చనిపోయారు. పీసీసీ అధ్యక్షుడిగా నేను ఆ ప్రమాద స్థలికి వెళ్దామంటే అనుమతించలేదు. దేవాదులలో 9మంది గల్లంతు అయితే ఐదేళ్ల తర్వాత అస్తిపంజరాలు దొరికాయి. మేడిగడ్డ నష్టానికి, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుంగిన ఘటనకు తేడా ఉంది. మేడిగడ్డ ప్రాజెక్టు నష్టం.. నిర్లక్ష్యం, నాణ్యతాలోపం వల్ల జరిగింది. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిన ఘటన విపత్తు లాంటిది. ఘటన జరిగిన వెంటనే హరీశ్‌రావు ఎందుకు రాలేదు. ఈ ప్రమాదం తర్వాత హరీశ్‌రావు రెండ్రోజులు అబుదాబిలో దావత్ చేసుకున్నారు" అని

# రెండున్నరేళ్లలో మామునూరు ఎయిర్ పోర్టు పూర్తి చేస్తాం

మొదటిపేజీ తరువాయి

1981 వరకు ఇక్కడి నుంచి రాకపోకలు కొనసాగేవి. క్రమేపీ హైదరాబాద్ అభివృద్ధి చెందడంతో ఎయిర్ పోర్ట్ హైదారాబాద్‌కు షిఫ్ట్ అయ్యింది. అయినప్పటికీ అక్కడి ప్రజలు అనేక పోరాటాలు చేశారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక విమానయాన రంగంలో ఓ విప్లవం మొదలైంది. పదేళ్లలో దేశంలోని ఎయిర్‌పోర్టుల సంఖ్య 79 నుంచి 150కి పెరిగింది. చిన్న చిన్న నగరాల్లోనూ ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేశాం. వరంగల్ వంటి నగరంలో ఎయిర్‌పోర్టు విషయంలో అడుగులు ముందుకుపడలేదు. తెలుగు ప్రజల మంత్రిగా పని చేయాలని చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు. ఏపీ కోసం ఎలా పని చేస్తావో.. అదే చిత్తశుద్ధితో తెలంగాణ కోసం కూడా పనిచేయాలని సూచించారు.
తెలంగాణలోనూ ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేయాలని కిషన్‌రెడ్డి సూచించారు. మామునూరు ఎయిర్‌పోర్టు క్లియరెన్స్ విషయంలో కొన్ని సమస్యలు వచ్చాయి. ఎయిర్‌పోర్టుకు 2800 మీటర్ల రన్‌వే అవసరం. 280 ఎకరాలు అదనంగా భూసేకరణ అవసరమని కేంద్రం నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. గత ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేనందువల్లే ఆలస్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం త్వరగా భూసేకరణ చేస్తే ఎయిర్‌పోర్టు పనులు వేగవంతం అవుతాయి. భూసేకరణ పూర్తయిన రెండున్నరేళ్లలో నిర్మాణం పూర్తి చేస్తాం. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఎన్‌వోసీ తీసుకొని క్లియరెన్స్ ఇచ్చాం. భద్రాద్రి ఎయిర్‌పోర్టు విషయంలో గతంలో ఒక స్థలాన్ని ప్రతిపాదించారు. గతంలో సూచించిన స్థలం ఫీజిబులిటీగా లేదు...మరో స్థలం ప్రతిపాదించారు. భద్రాద్రి విషయంలో కొత్త స్థలంపై ఫీజిబులిటీని పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం" అని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

# BRS నుంచి వచ్చిన 10 మంది ఎమ్మెల్యేలు తిరిగి వెళ్లిపోతరు

మొదటిపేజీ తరువాయి

ప్రజా సమస్యలను డైవర్ట్ చేసేలా సీఎం రేవంత్ రెడ్డి సంబంధం లేని అంశాల గురించి మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. మంత్రులు తన మాట వినడం లేదని స్వయంగా సీఎం రేవంతే చెప్పారన్నారు. బీసీల గురించి మాట్లాడిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేశారని అన్నారు. మామునూర్ ఎయిర్ పోర్టుతో కాంగ్రెస్ కు సంబంధమే లేదని.. ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వ కృషితోనే వరంగల్ ఎయిర్ పోర్టు వచ్చిందని తెలిపారు.
సీఎం రేవంత్ కు అసలు పరిపాలన పట్టుందా..? సీఎం కుర్చీ కాపాడుకోవడానికి ఆయనకు ఢిల్లీ టూర్లే సరిపోతున్నాయని ఎద్దేవా చేశారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి.. సీఎం రేవంత్ రెడ్డికి అసలు పోలికే లేదని.. నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడిన వ్యక్తి కిషన్ రెడ్డి.. పదవుల కోసం తిట్టిన పార్టీలోనే చేరిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అని సెటైర్ వేశారు. ప్రమాదం జరిగిన 9 రోజుల తర్వాతనా సీఎం ఎస్ఎల్ బీసీ ప్రమాద ఘటన స్థలానికి వెళ్లేదని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పదిహేను నెలలు అవుతోన్న ఇంతవరకు కేబినెట్ విస్తరణ ఎందుకు చేయలేదని నిలదీశారు. సీఎం రేవంత్ పాలన నీరో చక్రవర్తిలా ఉందని మండిపడ్డారు. వాటా ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి ఇవ్వాల్షిన నిధులు కేంద్ర ప్రభుత్వం ఇస్తోందన్నారు. త్రిభాష సిద్ధాంతం వద్దని రేవంత్ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.?

# హరీష్ రావు.. కొండగట్టు ప్రమాదంపై ఎందుకు మాట్లాడలేదు : జగ్గారెడ్డి

మొదటిపేజీ తరువాయి

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు జరిగిన కొండగట్టు బస్సు ప్రమాదం పై హరీష్ రావు ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు.
ఆరోజు 65 మంది చనిపోతే మీరెందుకు వెళ్లలేదని అన్నారు. పదేళ్ళ పాలనలో జరిగిన ఘోర ప్రమాదస్థలానికి కేసీఆర్ ఎందుకు వెళ్లలేదని నిలదీశారు. ప్రస్తుతం జరిగిన ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంలో కార్మికుల జాడ తెలియ లేదని, సహాయక చర్యలపై సీఎం స్వయంగా సీఎం క్యాంప్ ఆఫీసు నుంచి పర్యవేక్షించారని స్పష్టం చేశారు. బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోందని బీజేపీ తమపై ఆరోపణలు చేస్తోందని.. బీజేపీ పార్టీలో బడా నాయకులకే క్రమశిక్షణ లేదని స్వయంగా ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారని, అలాంటివారు తమను ప్రశ్నించడం వింతగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజా పాలన, రాజకీయ స్వేచ్ఛ కలిగిన పార్టీ అని జగమెరిగిన సత్యం అన్నారు. రాజకీయాల్లో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం సహజమే అని, అయితే అవి హద్దుల్లో ఉండాలని జగ్గారెడ్డి హితవు పలికారు.

# ఇది ఒక విపత్తు.. రాజకీయాలొద్దు.. బాధిత కుటుంబాలను ఆదుకుంటాం:

మొదటిపేజీ తరువాయి

బాధిత కుటుంబాలను ఆదుకుంటామని.. సమస్య పరిష్కారానికి అన్ని పార్టీలు సలహాలు ఇవ్వొచ్చని అన్నారు సీఎం రేవంత్ రెడ్డి. రెస్క్యూ టీములు ఆనవాళ్లే గుర్తించాయని.. ఇంకా క్లారిటీ రావాల్సి ఉందని అన్నారు. ఈ ప్రమాదం జరగగానే సంబంధిత మంత్రి, లోకల్ మంత్రి ఘటనాస్థలికి వచ్చారని అన్నారు. విపక్షాలు వాళ్ళ మెదడులో ఉన్న బురదను మాపై చల్లాలని చూస్తున్నారని మండిపడ్డారు సీఎం రేవంత్.
ఫ్లోరైడ్ బాధిత నల్గొండ జిల్లాకు నీళ్లివ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. 2014 నాటికి 32 కిలోమీటర్ల మేర టన్నెల్ పూర్తయ్యిందని.. పదేళ్ల పాలనలో కేసీఆర్ టన్నెల్ ను పక్కన పెట్టారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే టన్నెల్ ప్రాజెక్టును ప్రాధాన్యత ప్రాజెక్టుగా చేపట్టామని అన్నారు. అనుకోని విధంగా టన్నెల్ లో విషాదం జరిగిందని అన్నారు. ఈ ప్రమాదంలో 8మంది గల్లంతు కావటం బాధాకరమని అన్నారు సీఎం రేవంత్.ఘటన జరిగిన మరుక్షణం నుండి రెస్క్యూ చేస్తున్నామని.. జాతీయ, అంతర్జాతీయ టెక్నీషియన్లను పిలిపించి రెస్క్యూ చేపట్టామని అన్నారు. గతంలో శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ లో పవర్ జనరేషన్ లో ప్రమాదం జరిగితే ఎవ్వరినీ అక్కడికి వెళ్లనివ్వలేదని.. ఆనాడు పీసీసీ అధ్యక్షుడిగా తాను వస్తే జైల్లో పెట్టారని అన్నారు సీఎం రేవంత్. దేవాదుల, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో ఎక్కడ మరణించినా ఆనాడు ప్రభుత్వం విపక్షాలను అనుమతివ్వలేదని.. ప్రభుత్వంలో ఉన్న పెద్దలు అక్కడకు వెళ్ళలేదని అన్నారు సీఎం రేవంత్.కానీ ఈ ఘటన జరిగిన వెంటనే మంత్రి ఉత్తమ్ ను పంపి, కేంద్రంతో సమన్వయం చేసుకుని అన్ని సంస్థలను ఇక్కడికి రప్పించామని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద టన్నెల్ ఇది మేం మనోధైర్యం కోల్పోలేదని అన్నారు సీఎం రేవంత్. ఈ సమస్య పరిష్కరించేందుకు అవసరమైతే రోబోలను ఉపయోగించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాలనే పట్టుదలతో ఉందని..ఇందుకు అందరూ సహకరించాలని కోరుతున్నానని అన్నారు సీఎం రేవంత్.

## జమ్మికుంట పట్టణంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాద రావు 88వ జయంతి వేడుకలు



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 2**



జమ్మికుంట శివాలయం బొమ్మల గుడి ప్రాంగణంలో జమ్మికుంట బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొలుగూరి సదయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ దుద్దిల్ల శ్రీ ప్రాధా రావు గ్రామ సర్పంచిగా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా, డిసిసి మరియు పిసిసిలు లో పదవులు సేవ చేయడం జరిగింది. వారు శాసనసభ స్పీకర్ గా రాబోయే తరాలకు రోల్ మోడల్ గా ఉండడం జరిగింది. ఈ కార్యక్రమంలో జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు గూ డే పు సారంగపాణి, మదన్ రావు జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, పొనగంటి విష్ణువర్ధన్, గుల్లి జపానియా, అశోక్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## రాజీమార్గం రాజా మార్గం, గొడవలు వద్దు రాజీలు ముద్దు..

**– 8న మెగా లోక్ అద్దాలత్ హుజురాబాద్ కోర్టు లో...ఎస్ రవి...**

**కరపత్రం శంకరపట్నం మార్చి 2**




రాజీ మార్గమే రాజా మార్గం చేసుకొని, గొడవలు వద్దు రాజీలు ముద్దు అని, రాజీతో ఆర్థికంగా ఆర్థిక భారం తగ్గుతుందని, కేశవపట్నం ఎస్ ఐ కొత్తపల్లి రవి సూచించారు. ఆదివారం ఎస్ ఐ రవి మాట్లాడారు. గొడవలు వద్దు రాజీలు ముద్దు, వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవితకాలం కొనసాగుతాయని కలిసి ఉంటే కలదు సుఖం అనే మార్గాన్ని ఎంచుకొని, సోదర భావాన్ని పెంపొందించుకొని, వివాదాలను కనుమరుగు చేసేందుకు రాజీ మర్గాన్ని ఎంచుకొని, ఈనెల 8న హుజురాబాద్ కోర్టులో నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని, కేశవపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని, పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులను, రాజీ కోరుకునే ప్రతి వ్యక్తులు స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్ లో సంప్రదించి, తమ కేసు రాజి గురించి ఒప్పంద కావాలని, ప్రతి ఒక్కరికి పోలీసులు మెగా లోక్ అదాలత్ లో కేసు రాజీ కసం ముందుకు వచ్చే బాధితులకు ఫిర్యాదుదారులకు పోలీసులు న్యాయ సేవలు అందిస్తారని సూచించారు. ఈ జాతీయ మెగా లోక్ అదాలత్ లో రాజీ కుదుర్చుకొని ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలని ఎస్ ఐ రవి ఫిర్యాదుదారులకు బాధితులకు సూచించారు.

## ఆదివారం పలు శుభకార్యాలలో పాల్గొన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి...

**కరపత్రం ప్రతినిధి, హుజురాబాద్ /వీణవంక, మార్చి 2.**

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆదివారం పలు శుభ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.హుజురాబాద్,జమ్మికుంట,వీణవంక ,వావిలాల, మడిపల్లి, సింగాపూర్, బావుపేట, హన్మకొండ, వరంగల్ ప్రాంతాల్లో వివిధ



వివాహ, గృహ ప్రవేశ మరియు ఇతర శుభకార్యాల్లో పాల్గొన్నారు.హుజురాబాద్ లోని వెంకటసాయి గార్డెన్స్, ఎస్సార్ కన్వెన్షన్, మధువని గార్డెన్స్, బి ఎస్ ఆర్ గార్డెన్స్, వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం, ఎమ్మార్ కన్వెన్షన్ లలో జరిగిన వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.పెద్దపాపయ్యపల్లి, సింగాపూర్, చల్లూర్, కొత్తపల్లి, బిజిగ్గిరి షరీఫ్ గ్రామాల్లో జరిగిన వివాహ కార్యక్రమాల్లోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు.జమ్మికుంటలో శంకర నందన్ గార్డెన్స్, సువర్ణ ఫంక్షన్ హాల్, దినేష్ కన్వెన్షన్ లలో జరిగిన వివాహ శుభకార్యాల్లో పాల్గొన్నారు. మడిపల్లి గ్రామంలో జరిగిన రెండు శుభకార్యాల్లో, బావుపేట గ్రామంలో కొంగరి రవీందర్ కుమారుని వివాహంలో, ఎర్రగట్టుగుట్ట మిత్ర కన్వెన్షన్ లో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యేపాల్గొన్నారు.హన్మకొండలోని పీజీర్ గార్డెన్స్, టీవీర్ గార్డెన్స్, శ్రీరామ కళ్యాణ మండపం లలో జరిగిన వివాహ వేడుకల్లో హాజరై వధూవరులనుఆశీర్వదించారు. అనంతరం వరంగల్ ములుగు రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర కన్వెన్షన్ లో హుజురాబాద్ ఏఈఓ నిఖిల్ కుమార్ వివాహ వేడుకలో పాల్గొన్నారు.

# దిల్ సుఖ్ నగర్ పబ్లిక్ స్కూల్లో ఈరోజు యండమూరి మోటివేషనల్ క్లాస్




**సిటీ డెస్క్, కరపత్రం**

దిల్ సుఖ్ నగర్ పబ్లిక్ స్కూల్, వనస్థలిపురం బ్రాంచ్ లో ఈరోజు శ్రీ యండమూరి వీరేంద్రనాథ్ గారు 10 వ తరగతి విద్యార్థుల మోటివేషనల్ క్లాస్ నిర్వహించబోతున్నారు.

10 తరగతి పరీక్షలు ప్రారంభం కాబోతున్నందున విద్యార్థులకు ప్రేరణ కలిగించడానికి, పరీక్షలు ఎలా ఎదుర్కోవాలి అన్న విషయంపై తరగతి నిర్వహించబోతున్నారని స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి రంజని సతీష్ ప్రెస్ నోట్ లో మీడియాకు తెలియజేసారు.జీవితమే ఒక పరీక్ష లాంటిదని,ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తూ సాగడమే విజయానికి సోపానం అని ముందస్తుగా పంపిన సందేశంలో యండమూరి తెలియజేసారని శ్రీమతి రంజని అన్నారు.శ్రీ యండమూరి వీరేంద్రనాథ్ అందరికీ తెలిసిన ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు,రచయిత,సినిమా దర్శకుడని శ్రీమతి రంజని తెలియజేసారు.యండమూరి 4 సం.ల ఛార్టర్డ్ అకౌంటెంట్ కోర్స్ ను మూడు సంవత్సరాల్లో పూర్తి చేసిన ప్రతిభావంతుడని అన్నారు.

**ప్రముఖ ఛార్టర్డ్ అకౌంటెంట్ గా సుపరిచితుడని అన్నారు.**

యండమూరి అంటేనే ఒక స్ఫూర్తి అని, తెలుగు కన్నడ భాషల్లో 30 పైగా సినిమాలకు దర్శకత్వం, 7 టివి సీరియల్స్, 3 మంది అవార్డులతో పాటు,కన్నడ ఫిల్మ్ ఫేర్ అవార్డు గెలుచుకున్న ప్రతిభావంతుడని అన్నారు.అత్యధికంగా అమ్ముడుపోయిన విజయానికి 5 మెట్లు అనే నవలతో సంచలనం సృష్టించిన యండమూరి, రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని ప్రిన్సిపాల్ శ్రీమతి రంజని సతీష్ కరపత్రం తో అన్నారు.పరీక్షలకు సిద్ధమవుతున్న మా స్కూల్ విద్యార్థులకు యండమూరి మోటివేషన్ క్లాస్ వల్ల పరీక్షలంటే భయం,జంకు తొలగిపోయి ఆత్మ విశ్వాసం పెంచడమే,ఈ ప్రయత్నమని శ్రీమతి రంజని అన్నారు.

## శ్రీపాదరావు సేవా పురస్కారం అందుకున్న సమ్మిరెడ్డి....

**కరపత్రం శంకరపట్నం మార్చి 2**



రంగస్థల కళాకారునిగా , తన కళ నైపుణ్యంతో, మరుగున పడ్డ కలలను, రంగస్థలంపై అనేక వేషధరణలతో, కళ నైపుణ్యాన్ని ప్రదర్శించే రంగస్థల నటుడు కళాభిమాని, అలివేలి సమ్మిరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్, మంథని ముద్దుబిడ్డ, తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తనయుడైన, దివంగత మహానేత శ్రీపాదరావు సేవ పురస్కారానికి 2025 కు ఎంపికయ్యారు. ఆదివారం జరిగిన శ్రీపాదరావు జయంతి వేడుకల్లో కరీంనగర్ పట్టణంలో నిర్వహించిన శ్రీపాద సేవా పురస్కార అవార్డుల ప్రధానోత్సవములో, కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలం, గద్దపాక గ్రామానికి చెందిన రంగస్థల కళాకారుడు అలివేలి సమ్మిరెడ్డిని శ్రీపాదరావు సేవ పురస్కారానికి ఎంపిక చేయడం అభినందనీయమని తోటి కళాకారులు, మండల ప్రజలు గ్రామ ప్రజలు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. కళాకారులను ప్రోత్సహించడం చాలా అరుదు అయిన కార్యక్రమం శ్రీ పాదరవ సేవ పురస్కారం నిర్వహించి అందజేయడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

**కలలను ప్రోత్సహిస్తున్న శ్రీపాద సేవ పురస్కార్...**

రంగస్థల కలలను దివంగత మహానేత శ్రీపాద సేవ పురస్కారం ట్రస్ట్ ద్వారా రంగస్థలం కళాకారులను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని, 2025 సంవత్సరానికి శ్రీపాద సేవ పురస్కారం అందజేయడం, తన కలను గుర్తించి పురస్కారాన్ని అందించినందుకు నిర్వాహకులకు సమ్మిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రంగస్థల కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి కళా రంగాలను కాపాడాలని సమ్మిరెడ్డి కోరారు.

## మహిళలపై దాడులకు వ్యతిరేకంగా పోరాడుదాం:

**– అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలను విస్తృతంగా నిర్వహిద్దాం:**

**– పిఓడబ్లు జిల్లా అధ్యక్షురాలు మార్త రధక్క:**

**కరపత్రం పెద్దపల్లి జిల్లా ప్రతినిధి అంతర్గాం మార్చి 02**



మహిళలపై దాడులకు వ్యతిరేకంగా పోరాడుదామని,అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలను విస్తృతంగా నిర్వహిద్దామని,పిఓడబ్లు పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు మార్త రధక్క పిలుపునిచ్చారు. మార్చి ఒకటి నుండి 8 వరకు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం విజయవంతం చేయాలని, రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆదివారం పెద్దంపేట గ్రామంలో కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా పిఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు మాజీ సర్పంచ్ మార్త రాధక్క విడుదల చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ....76 సంవత్సరాల స్వాతంత్ర ఉత్సవాలు జరుపుకుంటున్న భారతదేశంలో స్త్రీలకు ఎక్కడ రక్షణ లేకుండా పోయిందనీ, అన్నారు. 114వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సభల సందర్భంగా మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునివ్వడం జరిగింది. వరకట్నం వేధింపులు, అత్యాచారాలు, పనిస్థలలో వేధింపులు, వివక్షత స్త్రీ పురుషుల సమానత్వానికై పోరాడవలసిన అవసరం ఉందనీ ,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ప్రాధాన్యత ఇవ్వకుండా మనిషివేసి ధోరణి కొనసాగిస్తున్నారనీ,కనీసం రక్షణ కల్పించే పరిస్థితి లేదనీ ,మణిపూర్ లో గాని, యూపీలో గానీ,ఏ వృత్తిలో ఉన్న లాంగిక వేధింపులు సామూహిక అత్యాచారాలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయనీ,కార్పొరేట్ కంపెనీలు అమ్మాయిలను వ్యాపార వస్తువుగా చూస్తున్నారు తప్ప మనిషికి ఇచ్చే విలువనివ్వడం లేదన్నారు .మతతత్వ బిజెపి పార్టీ వల్ల మహిళకు కనీస గుర్తింపు లేకుండా పోతుందన్నారు.

బేటి బచావో బేటి పడావో అని బాధలు చెప్పిన ఎక్కడ కూడా స్త్రీల పట్ల బీజేపీకి గౌరవమైన ఆలోచనలు లేవాలి అన్నారు. మోడీ విధానాలపైన. ఐక్యంగా పోరాడవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంద సతక్క, లగిసేటి సత్యక్క, ఉడుత సుగుణ ,పొన్నగంటి సునీత, తాడిచర్ల రాజక్క, గుండ మల్లేశ్వరి , నాంపల్లి పోచమ్మ , తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ నెల ప్రారంభ శుభాకాంక్షలు

**– హుజురాబాద్ బి ఆర్ ఎస్ మైనార్టీ నాయకులు మహమ్మద్ అంజాదుల్ల ఖాన్**

**కరపత్రం–హుజురాబాద్:**



రంజాన్ మాసం ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే నెల అని ఇది త్యాగం, ప్రార్థన, క్షమాభిక్ష, పరస్పర ప్రేమను పెంపొందించే గొప్ప సమయం. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఉపవాసాలు (రోజాలు) పాటిస్తూ, ప్రార్థనలు చేస్తూ, తమ ఆత్మీయ సాధనను మరింతగా బలోపేతం చేసుకునేదని హుజురాబాద్, బిఆర్ఎస్ మైనార్టీ నాయకులు మహమ్మద్ అంజాదుల్ల ఖాన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఈ నెలలోనే పవిత్ర ఖురాన్ అవతరించినట్లు ముస్లిం విశ్వాసం. అందుకే ఇది భక్తి, పుణ్యం, అల్లాహ్‌కు సమీపించుకునే అదృష్టమైన సమయంగా పరిగణించబడుతుంది. రంజాన్‌లో ముస్లింలు ఉదయం సహర్ (ఉపవాసం ప్రారంభం) నుంచి సాయంత్రం ఇఫ్తార్ (ఉపవాస విరామం) వరకు ఆహారం, నీరు తీసుకోకుండా ఉపవాసం పాటిస్తారు. అలాగే, తమ ఆలోచనలు స్వచ్ఛంగా ఉంచుకుంటూ, మంచి పనులు చేయడంపై దృష్టి పెడతారని అన్నారు.ఉపవాసం మహత్యం...రోజా అనేది కేవలం శారీరక ఉపవాసం మాత్రమే కాదు, అది మనస్సును పవిత్రం చేసుకోవడానికి, సహనాన్ని పెంచుకోవడానికి,మానవత్వాన్ని ప్రదర్శించడానికి ఒక గొప్ప సాధనంగా మారుతుంది. ఇది ఓర్పు, క్షమాభిక్ష,మానవతా విలువలను బలపరచే పవిత్ర ఆచారం వారు వివరించారు..రంజాన్‌లో సేవా కార్యక్రమాలు...ఈ నెలలో ముస్లింలు జకాత్ (దానం) అందిస్తూ, పేదలకు సహాయం చేయడానికి ముందుకొస్తారు. సామాజిక సేవలు, భిక్షాదానం, ఇతరుల పట్ల సానుభూతితో వ్యవహరించడం ఈ నెలలో మరింత ప్రాముఖ్యత పొందుతుందని పేర్కొన్నారు. ఈ పవిత్రమైన రంజాన్ మాసం ప్రతి ఒక్కరికీ ఆనందం, శాంతి,పుణ్యం కలిగించాలి. ముస్లిం సోదరులు,సోదరీమణులకు రంజాన్ ముబారక్! అల్లాహ్ మీ ప్రార్థనలను ఆలకించి, మీ కుటుంబాలకు ఆరోగ్యం, సుఖసంతోషాలు కలిగించాలి ఆకాంక్షించారు.

# సుల్తానాబాద్ లో ఘనంగా శ్రీపాదరావు జయంతి వేడుకలు:

**- శ్రీపాదరావు ఆశయాల సాధనకు కృషి...**
**- పేదల,బడుగు వర్గాల సంక్షేమానికి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేసిన శ్రీపాద రావు...**
**- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు..:**





**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు 88 వ జయంతిని పురస్కరించుకొని సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి స్థానిక నాయకులతో కలిసి నివాళులు అర్పించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ...రాజకీయాల్లో హుందాతనానికి శ్రీపాదరావు నిలువుటద్దమన్నారు. ఉమ్మడి ఏపీ శాసనసభ స్పీకర్ గా పనిచేసి ఆ పదవికే వన్నె తీసుకువచ్చారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల నాయకునిగా, అజాతశత్రువుగా శ్రీపాదరావు ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారని విజయరమణ రావు పేర్కొన్నారు. శ్రీపాదరావు రాజకీయ జీవితం భావితరాలకు ఆదర్శమన్నారు. మంత్రి శ్రీధర్ బాబు తన తండ్రి శ్రీపాదరావు బాటలో నడుస్తూ ప్రజల కోసం, ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్నారని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిలోనూ కీలకంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డి. దామోదర్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, నాయకులు సాయిరి మహేందర్, వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, పలువురు నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మాజీ కౌన్సిలర్లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్వాసీతుల సమస్యలు పరిష్కరించండి:



**- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ ను కోరిన పొట్యాల తాజా మాజీ సర్పంచ్ నీరజ వెంకటేష్:.**

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

పొట్యాల గ్రామ తాజా మాజీ సర్పంచ్ నీరజ వెంకటేష్ రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ ను హైద్రాబాద్ లో మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే ,శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా ఎల్లంపల్లి ప్రాజెక్ట్ భూ నిర్వాసీతుల సమస్యలు పరిష్కరించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ని హైదరాబాద్ లో ఆదివారం అంతర్గాం మండలం పొట్యాల గ్రామ తాజా మాజీ సర్పంచ్ నీరజ వెంకటేష్ కలిసి సమస్య ను వివరించారు. నిర్వాసిత సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని మాజీ సర్పంచ్ నీరజా వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మడ్డి తిరుపతి గౌడ్ ,పొట్యాల తాజా మాజీ సర్పంచ్ నీరజ వెంకటేష్, కొత్తపల్లి రాజు, శ్రీహరి, సతీష్, శ్రీనివాస్, సంతోష్ ,స్వామి, రమేష్, శ్రీనివాస్ ,రమేష్ ,ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం కమీషనరేట్ లో ఘనంగా మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి వేడుకలు:

**- రాష్ట్ర రాజకీయాల్లో అజాత శత్రవుగా చిరస్మరణీయుడు శ్రీపాద రావు..**
**- సిపి ఎం.శ్రీనివాస్ ఐపిఎస్..ఐజి:**





**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి.**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు 88వ జయంతి వేడుకలు రామగుండం పోలీస్ కమీషనరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఐపిఎస్., ఐజి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ....కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని మంథని ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిచిన శ్రీపాదరావు స్పీకర్ గా పని చేశారు. కాటారం మండలం ధన్వాడ గ్రామానికి చెందిన శ్రీపాదరావు సర్పంచ్ గా, సమితి ఉపాధ్యక్షుడిగా ఎల్ఎంబి బ్యాంకు చైర్మన్ గా బాధ్యతలు నిర్వర్తించారు. 1983 నుండి వరుసగా మూడుసార్లు మంథని ఎమ్మెల్యేగా గెలిచారు. 1999 ఏప్రిల్ 13న మహదేవపూర్ మండలం అన్నారం సమీపంలో అప్పటి పీపుల్స్ వార్ నక్సలైట్లు హత్య చేశారు. సర్పంచ్ స్థాయి నుండి అంచెలంచెలుగా ఎదిగి, శాసనసభ్యుడిగా, శాసన సభాదిపతిగా పదవి చేపట్టి పదవికే వన్నె తెచ్చారని అన్నారు. రాష్ట్రానికి ఎనలేని సేవచేశారని గుర్తు చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో అజాత శత్రవుగా పేరుగాంచడం జరిగిందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, ఆర్ఐ లు వామన మూర్తి, శ్రీనివాస్, సంపత్, సిసి హరీష్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం:



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

స్థానిక మార్కండేయ కాలనీలోని శ్రీ వివేకానంద హై స్కూల్ లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2001-02వ సంవత్సరంలో పదవ తరగతి చదివి, ఉద్యోగం, కుటుంబరీత్యా రాష్ట్రంలో ఎక్కడెక్కడో స్థిరపడిన వారందరూ కుటుంబ సభ్యులతో.. తాము చదివిన పాఠశాల ఆవరణలో తిరిగి కలుసుకున్నారు. బాల్య జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆడి పాడారు. పూర్వ ఉపాధ్యాయులను పూల మాలలు, శాలువాలతో ఆత్మీయంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయులు సుగుణా దేవి-సీతారామాచార్య, ఉపాధ్యాయులు మేజిక్ రాజా, దామోదర శర్మ, వేణు, రాజిరెడ్డి, ప్రేమ్ సాగర్, రవి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# రైతు బంధు బంద్ చేశారు.....
# రైతు (కు) భరోసా పూర్తిగా ఇయ్యరాయే...????

**- బొంతుపల్లి ఉపసర్పంచ్ చదువు జితేందర్ రెడ్డి..**



**కరపత్రం ప్రతినిధి, వీణవంక, మార్చి 2.**

రైతులకు గత ప్రభుత్వం ఇచ్చిన రైతు బంధును బంద్ చేసి... ప్రభుత్వం రైతు(కు) భరోసా ఇవ్వడం లేదని బొంతుపల్లి మాజీ ఉప సర్పంచ్ చదువు జితేందర్ రెడ్డి అన్నారు.ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేస్తూ,గత ప్రభుత్వం 2018నుండి పంట వేసే సమయంలో క్రమం తప్పకుండ రైతు బంధు నిధులు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని కానీ,ఈప్రభుత్వం అధికారం లోకి వచ్చాక ఖరీఫ్ కాలానికి వెయ్యాలిసిన పంట సాయం వేయలేదని జితేందర్ రెడ్డి అన్నారు. రైతు బంధు బంద్ చేసి,ఎన్నికల ముందు రెండు పంటలకు ఎకరానికి 15వేలు ఇస్తామనిచెప్పి ఎన్నికల తరువాత ఎకరానికి మూడు వేలు తక్కువ చేసి, 12 వేలు చేసి రైతు భరోసాగా పేరు మార్చుతూ 26 జనవరి 2025నుండి అమలు చేస్తామని జనవరి మొదటి వారం లో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం అందరికి తెలిసిందే.జనవరి 26న ఎంతో అట్టహాసంగాప్రారంభించి,మరుసటి రోజు ప్రతీ మండలంలో ఏంపిక చేసిన ఒక గ్రామంలో రైతు భరోసా నిధులు జమ చేసి,ఆ తర్వాత రైతు భరోసా నత్త నడకన నడుస్తుందని జితేందర్ రెడ్డిఅన్నారు.మూడు ఎకరాల వరకు రైతు భరోసా జమ చేశామని ప్రభుత్వం చెబుతున్నా, ఇంకా చాలా మంది రైతులకు డబ్బులు జమ కాలేదని అన్నారు.రైతు భరోసా జమఐన వారి పేర్లతో గ్రామాల్లో ప్లెక్సీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయని, అయితే 2024-2025 ఖరీఫ్ సీజన్లో జమ కానీ రైతులతో పాటు, జనవరి 26 నుండి ఇప్పటి వరకు రైతు భరోసా జమ కానీ రైతుల పేర్లతో సైతం ప్లెక్సీ ఏర్పాటు చేస్తూ,వారికి ఎప్పుడు రైతు భరోసా జమ చేస్తారో కూడాప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని చదువు జితేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# జమ్మికుంట అవోపా నూతన అధ్యక్షునిగా అకినపల్లి శ్రీనివాస్ ఎన్నిక...



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 2**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో ఆదివారం రోజున అవోపా సర్వసభ్య సమావేశం అధ్యక్షులు కే. ఆర్. వి నర్సన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అవోపా రాష్ట్ర,జిల్లా ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే రెండు సంవత్సరాల గాను నూతన అధ్యక్షున్ని కి ఎన్నికలు నిర్వహించడం జరిగిందని, ఈ కార్యక్రమంలో అకినపల్లి శ్రీనివాస్ ని స్థానిక అవోపా నాయకుల, సభ్యుల అభిప్రాయం మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా అకినపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే రెండు సంవత్సరాలకు అధ్యక్షులుగా ఎందుకున్న అవోపా నాయకులకు, సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే కాలంలో అవోపా సంఘ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారు గంజిస్వరాజ్ బాబు ,రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ నారాయణ, జోనల్ ట్రెజరర్ బచ్చు రమేష్, కరీంనగర్ జిల్లా అవోపా ఆధ్యక్షులు కొమురవెల్లి వెంకటేశం , జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత ఈశ్వర్ ప్రసాద్ మరియు జమ్మికుంట అవోపా సభ్యులు పాల్గొనడం జరిగింది

# ఘనంగా తబిత ఆశ్రమం లో శ్రీపాదరావు జయంతి వేడుకలు:





**కరపత్రం పెద్దపల్లి జిల్లా రామగుండం మార్చ్ 02:**

రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల తో రామగుండం పట్టణంలో నీ తబిత అనాథ ఆశ్రమం లో అప్పాసి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీపాద రావు జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమము నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ శ్రీపాద రావు 88వ జయంతిని పురస్కరించుకుని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాలతో రామగుండం పట్టణంలోని తబిత అనాధాశ్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అప్పాసి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి, ఆశ్రమంలోని పిల్లలకు,వృద్ధులకు అన్నదాన కార్యక్రమం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆయనను స్మరించుకుంటూ ఆయన కాంగ్రెస్ పార్టీకి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ముఖ్యంగా మంథని లాంటి మారుమూల ప్రాంతాలకు ఆయన చేసిన సేవలను కొనియాడుతూ మారుమూల గ్రామం ధన్వాడ నుండి సర్పంచ్ గా ఎన్నికై తరువాత ఎస్ఎల్బీ బ్యాంకు చైర్మన్గా, సమతి అధ్యక్షులు గా 1983 నుండి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ గా, ఆయన ఎదిగిన తీరు సామాన్య కార్యకర్తలకు ఆదర్శమని,నిజాయితీ నిబద్ధత గల ప్రజా నాయకుడు శ్రీపాద రావు అని ,కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈదునూరి హరి ప్రసాద్ ,కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు యాసిన్ బేగ్, సాదుల రమేష్. డివిజన్ అధ్యక్షులు. మొయినిద్దీన్ (పప్పీ ) సిరిశెట్టి సతీష్ గౌడ్. సీనియర్ కాంగ్రెస్ నాయకులు. ఎండీ. సలీం బేగ్, ఎండీ రషీద్, ఓదెలరాజ మొగిలి పటేల్, ఎండీ సాజిద్,ఎండీ. గౌస్ బాబా.ఎండీ, తాజ్,నామాల కుమార్ స్వామి పటేల్, ఈదునూరి వెంకట్, సుదగోని సతీష్ గౌడ్,ఎండీ దస్తగిరి..యువజన కాంగ్రెస్ నాయకులు. ఆశ్రఫ్ ఖాన్,తాని శ్రవణ్ పటేల్, మెహరాజ్ ఎండీ అంజయ్య,తదితరులు పాల్గొన్నారు.

# బేతిగల్ లో జాతరను తలపించిన మారమ్మ బోనాలు

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, మార్చి 2.**



వీణవంక మండలం బేతిగల్ గ్రామంలో ఆదివారం మారమ్మ తల్లి బోనాలు అంగరంగ వైభవంగా జరగగా, గ్రామ ప్రజల సమక్షంలో ఆడబిడ్డల మంగళహారతి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది. మారమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు . గ్రామంలో భూలక్ష్మి మహాలక్ష్మి బొడ్రాయి పోచమ్మ ప్రతిష్టాన పండగ 3వ తేదీన సోమవారం నుంచి ప్రారంభం కానుండగా, ఆదివారం గ్రామంలో మారమ్మ బోనలు గ్రామ ప్రజలు డప్పు సొప్పులతో మారమ్మ ఆలయానికి వెళ్లి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.